సాక్షి
అనకాపల్లి

మంగళవారం ၊ 14 ၊ మే ၊ 2024




తొలి ఓటు వేసిన ఆనందంలో యువతులు

నేనూ ఓటేశానంటున్న బామ్మ

ఓటెత్తారు

- ఉదయం నుంచి రాత్రి వరకూ సడలని సంకల్పం
- ఉత్సాహంగా ఓటేసిన మహిళలు, వృద్ధులు
- గంటల తరబడి లైన్లో వేచి ఉండి ఓటు హక్కు వినియోగం
- సమయం మించిపోయినా కదలని ఓటరు
- జోరువానలోనూ అదే జోరు
- పలు చోట్ల ఆలస్యంగా సాగిన ఓటింగ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఓటు పోటెత్తింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఓట్ల ప్రవాహం.. రాత్రి 10 గంటల వరకూ అదే జోరుతో సాగింది. గంటల తరబడి ఓటర్లు క్యూల్లో వేచి ఉండి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి వేళలో కొన్ని ప్రాంతాల్లో జోరువానలోనూ ఓటు సంకల్పం సడలలేదు. యువతరం ఉత్సాహాన్ని మించేలా.. వృద్ధులు, మహిళలు, గ్రామీణ ఓటర్లు వెల్లువలా తరలివచ్చారు. తమ తలరాతను మార్చే రథసారథులను ఎన్నుకోవడంలో ఓటర్లు కీలక పాత్ర పోషించారు. ప్రతీ బూత్.. ఓటర్లతో సందడి వాతావరణం కనిపించింది. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతలో కొత్త ఉత్సాహం కనిపించింది. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగు పడేందుకు.. నిరంతరం ప్రజలతో మమేకమవుతున్న నాయకత్వానికే మరోసారి పట్టం కట్టేందుకు మొగ్గు చూపినట్లు ట్రెండ్ కనిపించింది. పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు చిన్నా.. పెద్దా పోటీపడ్డారు. పలు బూత్‌ల వద్ద ఎన్నికల సంఘం సెల్ఫీ స్టాండ్లను ఏర్పాటు చేసింది. మొత్తంగా, విశాఖపట్నం పార్లమెంటు పరిధిలో 68.13 శాతం, అనకాపల్లిలో 70.37 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 63.09 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళి కొనసాగిందిలా..

ప్రతీ ఎన్నికల్లో ఉదయం, సాయంత్రం పోలింగ్ శాతం అధికంగా నమోదవుతుంది. మధ్యాహ్నం సమయంలో మందకొడిగా సాగుతుంది. అయితే ఈసారి ఎన్నికల్లో మాత్రం మధ్యాహ్నం కూడా ఎక్కడా ఓటింగ్ శాతం తగ్గిపోలేదు. మండుటెండలోనూ ఓటర్లు తమ హక్కును ఉపయోగించుకోవడం కనిపించింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటలకు 10.24 శాతం, 11 గంటలకు 20.47, ఒంటి గంటకు 34.75, 3 గంటలకు 47.66 శాతం నమోదైంది. అంటే మధ్యాహ్న సమయంలో సుమారు 13 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఇక 5 గంటల సమయానికి 59.39 శాతానికి పెరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో మొత్తంగా 68.13 శాతం నమోదైంది. అల్లూరి జిల్లాలో ఉదయం 9 గంటలకు 6.73 శాతంతో మందకొండిగా మొదలై 11 గంటలకు 18.07 శాతానికి చేరుకుంది. ఒంటి గంటకు 32.75 శాతం, 3 గంటలకు 48.67 శాతం... సాయంత్రం 4 గంటలకు 53.62 శాతంగా నమోదైంది. అప్పటికీ ఇంకా ఓటర్లు క్యూల్లో ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. అల్లూరి జిల్లాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. అనకాపల్లి జిల్లాలో ఉదయం 9 గంటలకు 8.47 శాతం పోలింగ్‌తో నెమ్మదిగా నమోదై.. 11 గంటలకు 19.97 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత ఒక్కసారిగా గేర్ మారింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఏకంగా సగానికిపైగా పోలింగ్ పూర్తయి 53.45 శాతం నమోదైంది. తర్వాత 3 గంటలకు 58.11 శాతం, సాయంత్రం 5 గంటలకు 69.3 శాతానికి చేరి.. మొత్తంగా 70.37 శాతం పోలింగ్ నమోదైంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే, అప్పటికే ఓటింగ్ కోసం లైన్‌లో ఉన్న వారందరికీ అవకాశం ఉండటంతో రాత్రి వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. మరో వైపు సాయంత్రం ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం సైతం ఓటర్ల సంకల్పాన్ని భగ్నం చేయలేకపోయింది. ఒకవైపు వర్షంతో కరెంట్ సరఫరా నిలిచిపోయి.. ఓటింగ్‌కు ఆలస్యమవుతుందని తెలిసినప్పటికీ.. వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు వెనుదిరగకుండా క్యూలో ఉండి మరీ ఓటు వేశారు.

ఓటింగ్ శాతం ఇలా..
(తుది సమాచారం అందేసరికి..)

ప్రాంతం	శాతం
విశాఖ పార్లమెంటు	68.13
అనకాపల్లి జిల్లా	70.37
అల్లూరి జిల్లా	63.09

అడుగడుగునా ఉల్లంఘనలు

పొత్తు కుదుర్చుకుని ఉమ్మడిగా బరిలో దిగిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు ఎక్కడికక్కడ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. దౌర్జన్యాలకు దిగి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. అనకాపల్లి జిల్లాలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఏకంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి పోలింగ్ సిబ్బందితో సెల్ఫీలు దిగుతూ ప్రచారం చేసేందుకు ప్రయత్నించారు. నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఓటమి భయంతో అధికారులపై మాటల దాడికి దిగారు. అనేక నియోజకవర్గాల్లో ఓటరు స్లిప్పులతోపాటు సూపర్ సిక్స్ హామీలతో కూడిన పత్రాలను పంపిణీ చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో కొద్ది మంది పోలింగ్ సిబ్బంది కళ్లు కనపడని వారి ఓట్లను తమకిష్టమైన వారికి వేసేందుకు యత్నించారు. విశాఖ ఉత్తరలో బీజేపీ అభ్యర్థి పార్టీ జెండాను పోలింగ్ కేంద్రం సమీపంలో కట్టారు. విశాఖ దక్షిణలో కొద్దిమంది రౌడీ యువకులు ఓటర్లను భయపెట్టే ప్రయత్నం చేశారు.

ఏజెన్సీలో ప్రశాంతంగా..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీసు బలగాలను మోహరించారు. కొన్ని చోట్ల వర్షం కురిసినా ఓటు వేసేందుకు గెడ్డలు దాటి ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మన్యంలో మునుపెన్నడూ లేనంతగా ఓటింగ్ జరిగింది. మారేడుమిల్లి మండలం గుర్తేడు ప్రాంతంలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను హెలికాప్టర్‌లో రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గూడెంకొత్తవీధి మండలం కప్పకొండ గ్రామస్తులు గుర్రాలపై దుప్పలవాడ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుపూడిలో తొలిసారిగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. బుంగాపుట్టు పంచాయతీ పరిధిలో 19 గ్రామాలకు చెందిన 1,313 మంది ఓటర్లకు లక్ష్మీపురం పోలింగ్ కేంద్రంలో అవకాశం కల్పించారు. వీరందరినీ నాలుగు జీపుల్లో అధికారులు పోలింగ్ కేంద్రానికి తరలించారు.



గొలుగొండ మండలం చీడిగుమ్మలలో బారులు దీరిన ఓటర్లు





స్ఫూర్తివంతం.. వృద్ధులు, దివ్యాంగుల చైతన్యం




నక్కపల్లిలో ఓటేసేందుకు తల్లిని తీసుకొని వస్తున్న కుమారుడు.. అవ్వను మోసుకొని వస్తున్న కానిస్టేబుల్



యలమంచిలి జిల్లా యర్రవరంలో రాత్రి 9.40 గంటలకు జరుగుతున్న పోలింగ్



నక్కపల్లి హైస్కూల్లో క్యూలైన్లో వేచివున్న మహిళలు

ఓటు పోటెత్తిందిలా..
(తుది సమాచారం అందేసరికి)

భీమిలి	60.67
విశాఖ తూర్పు	60.53
విశాఖ దక్షిణ	53.31
విశాఖ ఉత్తర	54.00
విశాఖ పశ్చిమ	56.49
గాజువాక	58.23
పెందుర్తి	56.50
ఎస్.కోట	73.19
చోడవరం	76.70
మాడుగుల	73.64
అనకాపల్లి	78.96
యలమంచిలి	61.46
పాయకరావుపేట	67.03
నర్సీపట్నం	64.93
అరకు	55.85
పాడేరు	45.78
రంపచోడవరం	59.25

గంట గంటకూ.. పెరిగిన పోలింగ్ (రాత్రి 10 గంటల వరకు అందిన సమాచారం)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	9 గంటలకు	11 గంటలకు	1 గంటలకు	3 గంటలకు	4 గంటలకు	6 గంటలకు	8 ఆ తర్వాత
అనకాపల్లి	2,13,714	1,68,754	11.60	28.54	46.10	60.80	65.40	74.71	78.96
చోడవరం	2,17,484	1,66,809	07.92	22.67	39.48	52.76	57.10	71.40	76.70
మాడుగుల	1,88,989	1,39,166	11.07	21.00	35.00	56.00	65.00	67.30	73.64
నర్సీపట్నం	2,12,046	1,37,691	06.68	21.32	40.80	58.12	59.15	59.61	64.93
పాయకరావుపేట	2,50,744	1,68,072	06.97	11.61	32.22	46.79	50.61	62.75	67.03
యలమంచిలి	2,06,394	1,26,844	06.59	14.69	34.18	47.54	53.44	54.96	61.46



వెబ్ కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవిపట్టన్ శెట్టి



ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, భరత్‌కుమార్, కంబాల జోగులు, ఉమాశంకర గణేష్, అనురాధ, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

దూరాభారం.. ఓటుపై మమకారం



ఒడిశా రాష్ట్రం నుంచి ఓటు వేసేందుకు కుటుంబసమేతంగా స్వగ్రామాలకు తరలివస్తున్న మత్స్యకారులు



యలమంచిలి రైల్వేస్టేషన్‌లో రైలు దిగి స్వగ్రామాలకు వెళ్తున్న మత్స్యకారులు

- ఇతర రాష్ట్రాల నుంచి ఓటేసేందుకు తరలివచ్చిన మత్స్యకారులు

యలమంచిలి రూరల్: ఎన్నికల వేళ దూరాభారాన్ని అధిగమించి ఓటు వేసేందుకు జనం రావడం విశేషం. ఊరిలో ఉండి సైతం ఓటు వేసేందుకు పోలింగ్‌స్టేషన్‌కు రాకుండా నిర్లక్ష్యం చేసే ఈ రోజుల్లో ఒడిశా, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతోపాటు ఏపీలో ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఓటర్లు యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలకు పెద్ద సంఖ్యలో తరలిరావడం విశేషం. స్వగ్రామాలకు చేరుకుని కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒడిశా రాష్ట్రం పూరి, పారాదీప్ ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు వందల సంఖ్యలో ఓటర్లు సోమవారం యలమంచిలి రైల్వేస్టేషన్‌లో దిగి వారి స్వగ్రామాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చామని వారంతా చెప్పారు. ఇక తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, వివిధ కోచింగ్ సెంటర్లలో కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్న యువకులు శ్రమించి యలమంచిలి చేరుకుని సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూరీ, పారదీప్‌ల నుంచి వచ్చిన మత్స్యకారులు అధిక శాతం పాయకరావుపేట నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్నారు. మత్స్యకార గ్రామాలైన రేవుపోలవరం, బంగారమ్మపాలెం యలమంచిలి నియోజకవర్గం పూడిమడక, కొత్తపట్నం గ్రామాల ఓటర్లు ఎక్కువమంది చేపలవేట నిమిత్తం ఒడిశాకు తరలి వెళ్లారు. వారంతా సోమవారం అధిక సంఖ్యలో రైళ్లపై ఇక్కడకు చేరుకుని ఓటేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- నలుగురు టీడీపీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు



దాడిలో గాయపడిన రాజునాయుడు

మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దిపాలెం పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు బంధువుతో ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రానికి హాజరయ్యాడు. తనకు కనిపించదని, అందుకే సహాయకుడిగా తన అన్న కొడుకుతో వచ్చినట్లు చెప్పాడు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు ఒక్కరే వెళ్లాలని, వెనుక ఎవరినీ వెళ్లనివ్వద్దని అభ్యంతరం తెలిపారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అయిన పోతల రాజునాయుడుపై ఇదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వంటాకుల శ్రీరామ్మూర్తి, పోతల సన్యాసినాయుడు, వంటాకుల చంద్రశేఖర్, ఏకా గణేష్ దాడికి పాల్పడ్డారు. నలుగురిలో ఒక్కడైన సన్యాసినాయుడు సిల్వర్ బకెట్‌తో దాడి చేసి గాయపరిచినట్టు రాజునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఆర్వోపై నోరు పారేసుకున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం ఏమి పీకుతున్నారంటూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నోరు పారేసుకున్నారు. మున్సిపాలిటీ గచ్చపు వీధి బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అయ్యన్నపాత్రుడు రిటర్నింగ్ అధికారిపై నోరు పారేసుకున్నారు. ఓటేసేందుకు వచ్చిన వారికి ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆర్డీవో ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పైస్థాయి అధికారులు ఆదేశించినా కింది స్థాయిలో నర్సీపట్నం ఆర్డీవో పర్యవేక్షణ అసలు బాగోలేదన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఉదయం నుంచి ఫోన్ చేస్తుంటే రివ్యూ మీటింగ్‌లో ఉన్నారని సీసీ చెబుతున్నారు తప్ప కలెక్టర్ స్పందించలేదన్నారు.



యలమంచిలిలో క్యూలైన్లో నిలుచున్న ఓటర్లు



పాయకరావుపేట హైస్కూల్లో బారులుదీరిన ఓటర్లు



ఓటేయడానికి వృద్ధుడిని తోడ్కొని వెళుతున్న వ్యక్తి



నక్కపల్లిలో ఓటేసిన వృద్ధులు



ఫొటో పాయింట్ వద్ద ఫొటో దిగుతున్న మహిళ



అచ్యుతాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం

ఆకర్షణీయంగా పింక్ పోలింగ్ కేంద్రం



పింక్ పోలింగ్ స్టేషన్‌లోని మహిళా ఉద్యోగులు



మునగపాక హైస్కూల్‌లోని పింక్ పోలింగ్ కేంద్రం

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 171 పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ స్టేషన్‌గా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ కేంద్రం పరిధిలో 1208 మంది ఓటర్లు ఉండగా వీరిలో 759 మంది మహిళలు ఉన్నారు. ఈ కేంద్రానికి సంబంధించి ఒక పీవో, ఐదుగురు ఏపీవోలు మహిళలే కావడంతో పింక్ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రానికి ఎదురుగా ముగ్గులతో అలంకరించడంతో పాటు బెలూన్ల ఏర్పాటు చేసి ఆకట్టుకునేలా తయారు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు ఈ కేంద్రాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. పింక్ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో బీఎల్‌వోలు శ్రావణ్‌కుమార్, హిమబిందులు ప్రత్యేకంగా కృషి చేశారు.

ఓటువేసేందుకు వెళ్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి



శ్రీనివాసరావును ఆస్పత్రికి తరలిస్తున్న సన్నిహితులు

కొయ్యూరు : కినపర్తి గ్రామానికి చెందిన నర్ని శ్రీనివాసరావు సోమవారం ఓటు వేసేందుకు వెళ్తుండగా గుండెనొప్పికి గురై మృతి చెందారు. ఇంటి నుంచి బయలుదేరిన ఆయనకు గుండెనొప్పి రావడంతో పడిపోయాడు. వెంటనే అతనిని అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు.

ప్రజాస్వామ్యానికి కూటమి నేతల తూట్లు

- అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు
- సీఎం రమేష్ ఓవరాక్షన్.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎన్నికల ప్రచారం
- టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్
- క్యూలో నిల్చున్న ఓటర్లకు ప్రలోభాల ఎర
- దేవరాపల్లి మండలం కాశీపురం బూత్‌లో అనుచరులతో హల్‌చల్
- రమేష్‌ను చూసి లేచి నమస్కరించిన పోలింగ్ సిబ్బంది
- రిటర్నింగ్ అధికారికి అయ్యన్న బెదిరింపులు.. బూతు పురాణం
- ఎన్నికల కేంద్రంలోకి కండువాతో వచ్చిన జనసేన అభ్యర్థి పంచకర్ల
- భీమిలిలో ఓటరు స్లిప్పుతో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ
- నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో హద్దు దాటిన ఎన్నికల అధికారి
- కళ్లు సరిగా కనిపించని వృద్ధుల ఓట్లు టీడీపీకి వేయించిన వైనం

ఓటమి భయం కూటమి నేతల కుతంత్రాలకు తెరతీసింది. బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు అడుగడుగునా ఎన్నికల కోడ్‌ను అతిక్రమించారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ధన, అనుచర బలంతో పేట్రేగిపోయారు. డబ్బులు వెదజల్లి సీటు దక్కించుకున్న కూటమి ఎంపీ అభ్యర్థి రమేష్ గత నెల రోజుల నుంచీ చేస్తున్న అరాచకాలను పోలింగ్ రోజైన సోమవారం మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. పోలింగ్ ప్రారంభానికి ముందే మొదలైన ఈ దారుణాలను పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగించారు. పోలీసులు, అధికారులు కూడా భయపడ్డ పరిస్థితి.



నక్కపల్లి మండలం ఉపమాకలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ



టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ మోహన్

సాక్షి, అనకాపల్లి: ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ఎన్నికల్ని కూటమి నేతలు తమ అరాచకాలతో పలు చోట్ల ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తన అనుచరులతో పోలింగ్ బూత్‌ల్లోకి నేరుగా సెల్‌ఫోన్‌లతో ప్రవేశించిచారు. టీడీపీ ఏజెంట్లతో ఫోటోలు దిగారు. జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులపై దూషణలకు పాల్పడ్డారు. పార్టీ కండువాలతో పోలింగ్ బూత్‌ల్లో ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓట్లు వేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేస్తూ అడుగడుగునా నిబంధనలకు తూట్లు పొడిచారు.

సీఎం రమేష్ నిబంధనల అతిక్రమణ

బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల ప్రచార కేంద్రంగా మార్చేశారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం కాశీపురం ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆయన వెళ్లారు. క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లను కలిసి బీజేపీకి ఓటేయాలంటూ ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్‌కు దిగారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓటింగ్ ప్రక్రియకు ఆటంకం కల్గిస్తున్న ఆయన్ని లోపలికి రానించడంతోపాటు, ఎన్నికల సిబ్బంది సకల గౌరవ మర్యాదలు చేయడం, వంగి వంగి నమస్కారాలు పెట్టడం గమనార్హం. అనంతరం దేవరాపల్లి హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద కూడా ఇదే విధంగా ఆయన వ్యవహరించారు. వారి అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఓటింగ్ ప్రక్రియకు ఆటకం కలిగించారు.

బూతుల అయ్యన్న

ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో ప్రజల ఛీత్కారాలు ఎదుర్కొనే మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు పోలింగ్ రోజూ తన నోటి దురుసును ప్రదర్శించారు. నర్సీపట్నం టౌన్ బాలికల హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులను బండ బూతులు తిడుతూ రెచ్చిపోయారు. రాయడానికి వీల్లేని తిట్లందుకున్నారు. దీంతో అధికారులు నివ్వెరపోయారు. ఆ బూతులు విని ఓటర్లు అయ్యన్నను అసహ్యించుకున్నారు. ఓటేసేందుకు లైన్లలో నిరీక్షిస్తున్న మహిళల ముందే ఈయన ఈ బూతుల్ని అందుకున్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంలను దూషించి మాట్లాడాడు.

ఓటరు స్లిప్పుల పేరిట మేనిఫెస్టో కాపీలు

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలో టీడీపీ నేతలు మరింతగా దిగజారారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టోను పంపిణీ చేశారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో మూలకుద్దు, మధురవాడ, సంతపేట అంబేడ్కర్ హైస్కూల్, పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్, రామారావుపేట, శివపురం తదితర ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌తో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేశారు. బంగారుమెట్ట మీద దుర్గాలమ్మ ఆలయం వద్ద సూపర్ సిక్స్ ఫ్లెక్సీ పెట్టి ప్రచారం చేశారు. పెదబొడ్డేపల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు నిలదీయడంతో పోలీసులు స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. రామారావుపేటలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మోహన్ స్వయంగా వచ్చి స్లిప్పులు స్వాధీనం చేసుకుని టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ అరాచకాలను అడ్డుకుని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది.

పార్టీ కండువాతో ఓటింగ్‌కు పంచకర్ల

పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ కూడా నిబంధనల ఉల్లంఘనలో తానేమీ తక్కువ కాదని నిరూపించుకున్నారు. మండలంలోని సుజాతనగర్ డీఏవీ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు ఉదయం 10 గంటల సమయంలో ఆయన వచ్చారు. పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన అతన్ని అధికారులుఏమాత్రంఅడ్డుకోకపోవపోడంగమనార్హం.

ఓటర్ల చైతన్యం.. అధికారిపై చర్యలు

ఓటర్లలో చైతన్యం పెరిగింది. వక్రబుద్ధితో వ్యవహరిస్తున్న ఎన్నికల అధికారికి బుద్ధి చెప్పేలా చేశారు. సోమవారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు పోలింగ్ బూత్‌లో కళ్లు సరిగా కనిపించని వృద్ధుల ఓట్లను అక్కడి పోలింగ్ అధికారి టీడీపీకి వేయించాడు. ప్రశ్నించిన ఏజెంట్‌పై దురుసుగా ప్రవర్తించాడు. దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలోని పోలింగ్ బూత్ నెం.173లో వృద్ధురాలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరగా, పోలింగ్ అధికారి కమలం పువ్వు గుర్తుకు ఓటేశారు. దీన్ని గుర్తించిన 70 ఏళ్ల వృద్ధురాలు నిలదీయడంతో ఏజెంట్లు ప్రశ్నించారు. విషయం ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుకు తెలియడంతో ఆయన అక్కడికి చేరుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిని విధుల నుంచి తొలగించి వేరేవారిని నియమించారు.

గుర్తేడులో హెలికాప్టర్‌లో ఈవీఎంలు

మావోయిస్టు ప్రభావిత ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేపట్టింది. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది తరలింపు కోసం రెండు హెలికాప్టర్‌లను ఉపయోగించారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం వై.రామవరం మండలంలో సమస్యాత్మక ప్రాంతమైన గుర్తేడుకు హెలికాప్టర్ సాయంతో ఈవీఎంలను, సిబ్బందిని తీసుకెళ్లారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది. అనంతరం భద్రత నడుమ హెలికాప్టర్‌లో ఈవీఎంలను రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గుర్తేడు, పాతకోట రెండు పంచాయతీల్లోని ఆరు బూత్‌లకు గాను 4,463 మంది ఓటర్లు ఉండగా, 2,048 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసేందుకు వెళ్తుండగా అపశృతి

- వాహనం బోల్తా పడి 27 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

అనంతగిరి: మండలంలోని కుడియ సమీపంలో సోమవారం వాహనం బోల్తా పడి 21 మందికి స్వల్ప గాయాలవగా, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు. పెదకోట పంచాయతీ పాటిపల్లి, టాంకోట, వేలమామిడి గ్రామాలకు చెందిన 25 మంది ఓటర్లువాహనంలో పెదకోట పోలింగ్ కేంద్రానికి బయలుదేరారు. కుడియ సమీపంలోని మలుపు వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలోని పాటిపల్లి గ్రామానికి చెందిన జన్ని కొండమ్మ, ఎస్.నాగులు, బి.కొండబాబు, జె.శుక్రన్న, వి.ఎర్రన్న, బి.చిన్నలమ్మ, పి.ఈశ్వరరావు, పి.పుష్పవతి, టాంకోటకు చెందిన పి.రాములమ్మ, వేలమామిడికి చెందిన పి.వరహాలమ్మ, పి.పెద్దమ్మ,పి.అప్పన్న, ఎస్.రాజు, వి.రత్నయ్య, కె.కొండబాబు, పి.చిన్నలక్ష్మి, పి.అప్పలస్వామి, ఎం.ప్రసాద్, డ్రైవర్ బి.బాలురాజు, హెల్పర్ బి.జగదీష్‌లు స్వల్పంగా గాయపడ్డారు. పాటిపల్లికి చెందిన బోయిన చిన్న, ఉల్లి ఎండమ్మ, పి.రాములమ్మ, కె.తవుడమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరందరికి పినకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాద విషయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి వైస్ ఎంపీపీ ఉర్మ శకుంతల సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన ఆయన అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ



విశాల్



ప్రసాద్

ఎటపాక: సోమవారం ప్రకటించిన సీబీఎస్‌ఈ టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో ఎటపాక జవహార్ నవోదయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కరాచారి తెలిపారు. పదవ తరగతిలో పండా విశాల్ 466 మార్కులు సాధించి(500 మార్కు లకు) ప్రథమ స్థానంలో నిలిచాడు.బి.హేమగణలత 463 మార్కులతో ద్వితీయ స్థానంలో, 460 మార్కులతో అంకిత మూడవ స్థానంలో నిలిచారు. అదే విధంగా 12వ తరగతిలో ఎల్.ప్రసాద్ 433 మార్కులతో ప్రథమ, మాన్విత వినీల దొర 424 మార్కులతో ద్వితీయ, బ్లెస్సీ 413 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం నేతృత్వంలో ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు మంచి మార్కులు సాధించటం అభినందనీయమని ప్రిన్సిపాల్ భాస్కరాచారి తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ప్రతిభ చాటిన ఆయా విద్యార్థులను పలువురు అభినందనలు తెలిపారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఆయా ప్రాంతాల నుంచి గమ్యస్థానాలకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున విశాఖపట్నం, శ్రీకాకుళం స్టేషన్‌ల నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరవలసినవిశాఖపట్నం–తిరుపతి (08 583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 11.20 గంటలకు బయల్దేరింది.
- శ్రీకాకుళం రోడ్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరవలసిన శ్రీకాకుళం రోడ్‌-తిరుపతి(07441) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 14 గంటలు ఆలస్యంగా మంగళవారం ఉదయం 5.30 గంటలకు బయల్దేరింది.
- విశాఖలో సోమవారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మధ్య రాత్రి 12.30 గంటలకు బయల్దేరింది.

ఓటెత్తిన యువత

- తొలి'చుక్క' పొడిచింది
- తొలిసారిగా ఓటు వేసిన వారిలో హర్షాతిరేకం

ఓటు హక్కు వినియోగించుకోవడం ఒక వేడుక. కొత్తగా హక్కు పొందినవారు మొదటిసారిగా ఓటు వేయడానికి పోటెత్తారు. యలమంచిలి నియోజకవర్గంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత సామాజిక బాధ్యత గుర్తెరిగి సమర్థవంతమై పాలన అందించే నాయకత్వం వైపే మొగ్గు చూపింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిజాయితీగా ఓటు వేయడం గర్వంగా ఉంటుందని చెప్పారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకున్నామని పలువురు పేర్కొన్నారు. తొలిసారి ఓటేసిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

సంతోషంగా ఉంది



కొత్తగా ఓటు వచ్చినందుకు సంతోషంగా ఉంది.ఇటీవలే ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకున్నాను.ఓటరు ఐడీ కార్డు వచ్చింది.కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి రావడం ఎనలేని ఆనందాన్నిచ్చింది.పనిచేసే నాయకుడిని గుర్తించి స్వేచ్ఛగా ఓటు వేశాను.

– బోజా వైష్ణవి, యలమంచిలి

మంచి నేతను ఎన్నుకునే అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది.అలాంటి వజ్రాయుధాన్ని తొలిసారిగా వినియోగించుకున్నాను.ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఓటు హక్కు ద్వారా ఎన్నుకునే అవకాశం కలుగుతుంది.నాకు నచ్చిన నాయకుడికి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– చనకాల ధనలక్ష్మి,యలమంచిలి


మా నమ్మకం నిలబెడతారని ఆశ



తొలి ఓటు వేసినప్పుడు చెప్పలేని ఆనందంగా ఉంది. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని యువతకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వారిని ఎన్నుకునేందుకు ఓటు వేశాను. మా నమ్మకం నిలబెడతారని ఆశిస్తున్నా.

–రాయవరపు చంద్రశేఖర్, యలమంచిలి

సద్వినియోగం చేసుకున్నా..



మొదటిసారి ఓటు వేశాను.పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నా.ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.చాలా మంది యువత తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.యువత అంతా ఓటును సద్వినియోగపరుచుకున్నారు.

– రౌతు సత్య గౌతం, యలమంచిలి

బాధ్యతాయుతంగా ఓటేశా..



ఓటు ద్వారా పాలకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించడం హర్షనీయం. బాధ్యతాయుతంగా ఓటు వేశాను. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది.స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నాను.తొలి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– నగిరెడ్డి మహిత, యలమంచిలి

కొత్త అనుభూతి



ప్రజాస్వామ్యానికి మంచి చేసే వారిని ఎన్నుకోవాలని అనుకుని ఓటు వేశా. చాలా సంతోషంగా అనిపించింది. అభివృద్ధి,సంక్షేమం చేయగల సమర్థత ఉన్న నాయకుడు, ప్రజల కోసం పనిచేసే వ్యక్తిత్వం ఉన్న వారికి ఓటువేశాను. ఓటు వేసేందుకు చేతివేలిపై పెట్టిన సిరా చుక్క కొత్త అనుభూతినిచ్చింది.

–శ్రావణి,యలమంచిలి


యలమంచిలి బ్రిడ్జి స్కూల్ పోలింగ్ కేంద్రంలో క్యూలైన్లలో ఓటర్లు


యలమంచిలిలో బారులు తీరిన ఓటర్లు


అనకాపల్లి జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద ..


అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద మహిళా ఓటర్లు

ఓటోత్సాహం


బారులు తీరిన ఓటర్లు


విజయరామరాజుపేట పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు


యలమంచిలి రైల్వేస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో..


యలమంచిలిలో క్యూలైన్‌లో ఓటర్లు


భీమునిగుమ్మం హైస్కూల్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, చిత్రంలో ఎంపీ సత్యవతి


యలమంచిలిలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


అనకాపల్లిలో ఓ పోలింగ్ వద్ద పెద్ద సంఖ్యలో..


అనకాపల్లి వేల్పులవీధి పోలింగ్ బూత్‌వద్ద వైద్య సిబ్బంది


అనకాపల్లి వేల్పులవీధి పోలింగ్ బూత్ వద్ద పోలీస్ బందోబస్తు


మునగపాకలో..

- అనకాపల్లిలో 78.96, యలమంచిలిలో 61.46 శాతం పోలింగ్
- భారీగా తరలివచ్చి ఓట్లు వేసిన వృద్ధులు, మహిళలు
- ఉత్సాహంగా ఓటేసిన యువకులు
- స్ట్రాంగ్ రూంకు చేరుకున్న ఈవీఎంలు

యలమంచిలి రూరల్/అనకాపల్లి: భారీగా తరలివచ్చిన వృద్ధులు,దివ్యాంగులు, మహిళలు..ఉత్సాహంగా యువ ఓటర్లు.. తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. కొన్ని చోట్ల కార్యకర్తల మధ్య వాగ్వాదం,స్వల్ప ఘర్షణలు, చెదురుమదురు సంఘటనలు మినహా సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తుది సమాచారం అందే సమయానికి అనకాపల్లిలో 78.96, యలమంచిలిలో 61.46 పోలింగ్ శాతం నమోదైంది. అభ్యర్థుల భవిత ఈవీఎంలలో నిక్షిప్తమైంది.పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ కొన్ని ప్రాంతాల్లో రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం ఆరు గంటలలోపు కేంద్రాలకు చేరుకున్నవారందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. అంతకుముందు ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పలు చోట్ల కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరి ఉండడం కనిపించింది.కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. అధికార యంత్రాంగం ప్రతి రెండు గంటలకొకసారి పోలింగ్ శాతం ప్రకటించింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 10 గంటల తరువాత కూడా కొన్ని కేంద్రాల్లో కొనసాగింది.జిల్లా కేంద్రంలో స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు చేరుకోగా వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

నిఘా నీడలో పోలింగ్..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం నిఘా నీడలో సాగింది.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను మోహరించారు.పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంకు తరలించేంతవరకు బందోబస్తు కొనసాగించారు. ఎస్పీ మురళీకృష్ణ,పరవాడ డీఎస్పీ సత్యనారాయణ యలమంచిలి సీఐ గఫూర్,పట్టణ,రూరల్ ఎస్‌ఐలు పాపినాయుడు,సింహాచలం ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తూ పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా చూశారు.

- అనకాపల్లి నియోజకవర్గంలో 251 పోలిగ్ బూత్‌లకుగాను 502 ఈవీఎంలతోపాటు అదనంగా 30 ఈవీఎంలను తీసుకుకొచ్చారు.
- సుమారు ఐదు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అదనంగా ఉన్న ఈవీఎంల వాటి స్థానంలో ఏర్పాటుచేసి పోలింగ్ నిర్వహించారు.దీంతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది.
- అనకాపల్లి గాంధీనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఎన్నికల జరిగిన తీరును పర్యవేక్షించారు.
- ఎప్పటికప్పుడు పోలింగ్ జరుగుతున్న తీరు, వివాదాలు, ఈవీఎంల మొరాయింపుపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆరాతీశారు.
- గవరపాలెం సంతబయలు పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు రాత్రి 8 గంట వరకూ ఓటు వేశారు.
- యలమంచిలి మున్సిపాలిటీ పరిధి యర్రవరంలో రాత్రి 10 గంటల తరువాత కూడా పోలింగ్ కొనసాగింది.

అచ్యుతాపురం: మండలంలో 71 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తహసీల్దార్ సరోజి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ తీరును పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటలకు నియోజక వర్గ స్థాయిలో 67.98 శాతం నమోదయింది. ఇంకా పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మునగపాకలోఎన్నికల సరళిని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, పార్టీనాయకులుపరిశీలించారు.

రాంబిల్లి: మండలంలో 74 శాతం పోలింగ్ నమోదైంది. అప్పన్నపాలెం, కట్టుబోలు, పంచదార్ల పోలింగ్ కేంద్రాల్లో కొంత సేపు ఈవీఎంలు మొరాయించాయి. దిమిలిలో పంచాయతీ కార్యాలయం పోలింగ్ కేంద్రంలో ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఈ కేంద్రం ఇరుకుగా ఉండడం, ఎక్కువ మంది ఓటర్లను ఇక్కడ కేటాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వాడ నర్సాపురం, కొత్తపట్నం,పెదకలవలాపల్లి గ్రామాల్లో ఇరువర్గాల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. పోలీసులు , కేంద్ర బలగాలు రంగంలో దిగి వారిని చెదరగొట్టారు. కొత్తపేట,కొత్తపట్నం,గోకివాడ గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ అప్పలస్వామి తెలిపారు.

కశింకోట: మండలంలో సుమారు 75 శాతం మేర పోలింగ్ జరిగింది. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓట్లు వేశారు. బయ్యవరం, సుందరయ్యపేట గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో దాదాపు రాత్రి పది గంటల వరకూ పోలింగ్ జరిగింది. ఈ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల తరువాత వచ్చిన చోడే సత్యవతి, చోడే చంటి, డొప్పా పార్వతి తదితరులను ఓటు వేయడానికి అనుమతించలేదు.

మరోసారి గెలుపు నాదే:ఎమ్మెల్యే కన్నబాబురాజు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి రూరల్: మహిళల ఆశీస్సులతో నాలుగోసారి యలమంచిలి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) ధీమా వ్యక్తం చేశారు. సోమవారం యలమంచిలిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించిన మహిళలంతా వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు ఇచ్చారని చెప్పారు.ఓటు వేసిన మహిళలంతా తనకు ఇదే విషయాన్ని చెప్పారన్నారు. పోలింగ్‌కు ముందు 20 నుంచి 25 వేల మెజార్టీ వస్తుందని భావించానని,కానీ సోమవారం ఓటింగ్ సరళి చూస్తే 40వేల మెజార్టీతో తాను గెలుస్తానన్న నమ్మకం కలుగుతోందన్నారు. చంద్రబాబునాయుడు ఇస్తున్న హామీలను ప్రజలు ముఖ్యంగా మహిళలు నమ్మడం లేదన్నారు.

అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయం


విలేకరులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి: నియోజకవర్గంలో తనతో పాటు ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక భీమునిగుమ్మంలో భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతి విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వారు తెలిపారు. మరో సారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. గత ఎన్నికల కంటే ఈ సారి ఎన్నికల్లో ఓటర్ల అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వారు చెప్పారు. నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌లను పరిశీలిస్తున్న సమయంలో ఓటర్ల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీల్ చైర్లలో వచ్చిన వృద్ధులు


అచ్యుతాపురంలో వైద్య సిబ్బంది


అచ్యుతాపురంలో ఓటు వేసేందుకు మండుటెండలో వస్తున్న మహిళలు

ఉత్సాహంగా వృద్ధులు..

ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సామాజిక బాధ్యతగా పెద్దలంతా ఓటు కోసం తరలివచ్చారు.దీంతో యలమంచిలి పట్టణం,మండలంలో ఏ పోలింగ్ కేంద్రం వద్ద చూసినా వృద్ధులు పెద్ద సంఖ్యలో కనిపించారు.కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో వీల్‌చైర్లలో వచ్చి వీరు తమ ఓటు హక్కునువినియోగించుకున్నారు.నియోజకవర్గంలో దాదాపు అన్ని పోలింగ్ బూత్‌లలో వృద్ధులు భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.


సమయం దాటిన తరువాత వచ్చారని అనుమతించకపోవడంతో బయ్యవరంలో పోలింగ్ కేంద్రం గేటు వద్ద నిరీక్షిస్తున్న ఓటర్లు


గోకివాడలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న కుటుంబసభ్యులు


రాంబిల్లి మండలం గోకివాడలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటు వేసిన అభ్యర్థులు, నాయకులు...

- ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి దంపతులు కుటుంబ సమేతంగా అనకాపల్లి మెయిన్ రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకటరమణమూర్తిరాజు యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర,వైస్ ఎంపీపీ రాజాన శేషు తదితరులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు.
- కశింకోట మండలంలోని స్వగ్రామం అమీన్ సాహెబ్‌పేటలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- మునగపాక పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- అనకాపల్లి 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు ఉడ్‌పేట ఎలిమెంటరీ స్కూల్, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి యశోద దంపతులు విజయరామరాజుపేట పోలింగ్‌బూత్‌లోను, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తుమ్మపాలలో, ఎంపీపీ గొర్లి సూరిబాబు మండలంలో గోపాలపురం ఎలిమెంటరీ స్కూల్‌లోను, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కొత్తూరు పంచాయతీ కార్యాలయంలోను కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించుకున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు


తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


వేరే వ్యక్తుల సాయంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు


అనకాపల్లి, కశింకోట మండలం తేగాడలలో ఓటు వేసేందుకు చంటి పిల్లలతో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న ఓటర్లు


ఆటోలో పోలింగ్ కేంద్రానికి వెళుతున్న వృద్ధులు

ట్రెండ్ ఎలా ఉంది?

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా
- గెలుపోటముల అంచనాలపై చర్చ

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నువ్వానేనా అనే విధంగా ప్రచారం చేశారు. ఇప్పటివరకు నామినేషన్ల ఘట్టం , సోషల్ ఇంజినీరింగ్, పోల్ మేనేజ్‌మెంట్ తదితర వ్యవహారాల్లో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు తాజాగా పోలింగ్ ముగిసిన నేపథ్యంలో అంచనాల్లో మునిగారు. పోలింగ్ సరళి ఎలా సాగింది, జనం మొగ్గు ఎటువైపు ఉంటుంది, ఏ ప్రాంతాల్లో తమకు అనుకూలంగా, ప్రతికూలంగా ఓట్లు పడి ఉంటాయనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఆయా బూత్‌ల వారీగా నమోదైన ఓట్ల వివరాలకు సంబంధించి, పోలింగ్ శాతం తదితర వివరాలతో కూడికలు, తీసివేతలపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్ర,జాతీయ స్థాయిలో ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపై కూడా చర్చ జోరుగా సాగుతోంది. సోమవారం సాయంత్రం నుంచే జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళిపై ప్రధాన పార్టీల అభ్యర్థులు తమతమ ముఖ్య అనుచరులు, మండలస్థాయి నేతలతో గ్రామాలు, మండలాలవారీగా ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు.ముఖ్యంగా పోలింగ్ ఏజెంట్లతో చర్చించి ఓటింగ్ సరళి ఎలా సాగిందో తెలుసుకున్నారు. అంతేకాక బూత్‌లవారీగా ఎక్కడ మెజార్టీ వస్తుంది, ఎక్కడ తగ్గుతుందని అంచనాలు వేస్తున్నారు.అభ్యర్థులంతా ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాలపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.ఇదిలా ఉండగా ఎన్నికల ఫలితాలపై పలువురు జోరుగా బెట్టింగ్ నిర్వహిస్తుండడం గమనార్హం.


ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై వస్తున్న దివ్యాంగుడు


యలమంచిలి పాతవీధి ఎంపీపీ స్కూల్ పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు


అనకాపల్లిలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు

ఓటు ప్రతి ఒక్కరి బాధ్యత : వర్ధమాన నటుడు రాఖీ


ఆక్సాహేబుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న నటుడు రాఖీ

కోటవురట్ల : ఓటు ఓ అద్భుతమైన ఆయుధమని, అందరూ బాధ్యతగా ఓటు వేయాలని వర్ధమాన యువ నటుడు అల్లు రామకృష్ణ ఉరఫ్ రాఖీ అన్నారు. స్వగ్రామమైన ఆక్సాహేబుపేటలో రాఖీ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్ద హీరోల సినిమాల్లో పలు పాత్రలు పోషించిన రాఖీ ఇపుడిపుడే చిన్న సినిమాలలో ప్రధాన పాత్రలు పోషించే స్థాయికి ఎదుగుతున్నారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్న తపనతోనే తన స్వగ్రామం వచ్చినట్టు రాఖీ తెలిపారు. తనకు ప్రముఖ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ అంటే ఎంతో ఇష్టమని, అలాగే నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ అన్నా ఎంతో అభిమానమని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం తన మిత్రులను కలుసుకుని సరదాగా గడిపారు.